క్లుప్తంగా

పెండింగ్ మెస్ బిల్లులను విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు అన్నారు. కడప నగరంలోని ఆర్‌ఎస్‌పీ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో ఉండి చదువుతున్న విద్యార్థులకు ఐదు నెలలుగా మెస్‌చార్జీలను ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం స్పందించి మెస్‌చార్జీలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో విద్యార్థి సంఘ నాయకులు నాగేంద్ర, శ్రీనివాసులు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న సత్యరాజు

కడప కోటిరెడ్డి సర్కిల్ : మాల మహానాడు కడప నగర అధ్యక్షుడిగా చెంచుల డేవిడ్ సత్యరాజును నియమించినట్లు రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జాకట విజయశేఖర్ తెలిపారు. బుధవారం సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు ఆయన చెప్పారు. అలాగే నగర ఉపాధ్యక్షుడిగా ఎన్. మణి, కార్యదర్శులుగా వరప్రసాద్, పి. సంజీవయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం ఆయన ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేసి మాట్లాడుతూ మాలల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షుడు ఇ. సురేష్, ఆకుమళ్ల పురుషోత్తం పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి



రన్ 4కేలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్ : ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 4 రియు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ మాట్లాడుతూ ఫ్రీడమ్ రన్ ముఖ్య ఉద్దేశ్యం ఆరోగ్యంగా ఉండడం కోసమేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ ఖాజా మొయినుద్దీన్, సికిందర్ హుస్సేన్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు సన్మానం



ఆటో డ్రైవర్‌ను సన్మానిస్తున్న లయన్ పటాన్ ఖాదర్‌బాష తదితరులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలో రెండు రోజుల క్రితం ఆటోలో పోగొట్టుకున్న ఏడు తులాల బంగారు, పదివేల నగదును ఆటో డ్రైవర్ బిలాల్ అహ్మద్ బాధితులకు అప్పగించడం అభినందనీయం అని సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషన్ సివిల్ అండ్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ నగర అధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్‌బాష అన్నారు. బుధవారం ఆయన నిజాయితీకి మెచ్చుకుంటూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు జారీక్, మస్తాన్, షఫీ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చింతకొమ్మదిన్నె : వీఎన్‌పల్లి మండలం ఆడవి చెర్లోపల్లి గ్రామానికి చెందిన కొప్పల గంగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర పరిశ్రమల సలహాదారుడు, స్విస్ట్ కళాశాల చైర్మన్ రాజోలి వీరారెడ్డి బుధవారం తను స్థాపించిన ఆర్‌వీఆర్ ఫౌండేషన్ తరపున రూ.50,000 మృతుడి కుటుంబానికి స్విస్ట్ కళాశాలలో అందించారు. మృతుడి కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాజోలీ సాయిచరణ్‌రెడ్డి, సామాజిక కార్యకర్త కొప్పల ప్రహ్లాద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి రాష్ట్ర సభలు

రామాపురం: నవంబర్ 17, 18, 19తేదీల్లో నంద్యాల్లో నిర్వహించే మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర పేర్కొన్నారు. బుధవారం మండలంలో మహిళా సమాఖ్య రాష్ట్ర మహా సభల కరపత్రాలను విడుదలు చేశారు.

వినాయకుడికి పూజలు

రాయచోటిటౌన్ : శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన శ్రీ వినాయకుడికి సంకటహర పూజలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సంకట హర చతుర్థి సందర్భంగా వినాయకుడికి రుద్రాభిషేకం, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వావారికి ఇష్టమైన గరిక, పూలు, బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు.

అమరజీవి త్యాగం మరువలేనిది



కడప కోటిరెడ్డిసర్కిల్ : పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి, ఇతరులు



కడప ఎడ్యుకేషన్ : పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది



కడప ఎడ్యుకేషన్ : పెన్షనర్ల సంఘం కార్యాలయంలో పొట్టి శ్రీరాముల చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. బుధవారం కళాశాలలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారందరూ ఒక రాష్ట్రంగా ఉండాలని భావించి ప్రాణత్యాగం చేసిన గొప్ప మహనీయుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. ఆయన త్యాగం, పట్టుదల నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : అమరజీవి పొట్టి శ్రీరాముల ప్రాణత్యాగమే ఆంధ్రరాష్ట్ర అవతరణ అని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్జహాన్ అన్నారు. బుధవారం కళాశాలలో పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల కార్యాలయంలో..

కడప నగరం పెన్షనర్ల కార్యాలయంలో పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, కోశాధికారి నగేష్, శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

కడప కోటిరెడ్డిసర్కిల్/వైవీయూ : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి కొనియాడారు. బుధవారం యూనివర్సిటీలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వాడి గొప్పతనాన్ని చాటి చెప్పిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, అదనపు పరీక్షా నియంత్రణ అధికారి సుప్రియ, ఆర్కిటెక్చర్ కోఆర్డినేటర్ మాన్విత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీతో గృహ రుణాలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : కెనరా బ్యాంక్ ద్వారా అతి తక్కువ వడ్డీతో హౌసింగ్ రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఆ బ్యాంక్ డివిజనల్ మేనేజర్ అవినాష్ తెలిపారు. బుధవారం మరియాపురం కెనరా బ్యాంక్ శాఖ కార్యాలయంలో హౌసింగ్ రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ మేనేజర్ రత్నపాల్ మాట్లాడుతూ హౌసింగ్, వెహికల్, మార్ట్‌గేజ్ రుణాలను అతి తక్కువ వడ్డీతో ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశంను కడప నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అవినీతి నిర్మూలనకు కృషి

కడప ఎడ్యుకేషన్ : అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పవర్‌గ్రిడ్ సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌రావు అన్నారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ –2023లో భాగంగా బుధవారం కడపలోని రాజీవ్‌పార్కు, కొత్తబస్టాండ్‌ల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు.

అమృత్ పథకం పనులను పూర్తి చేయాలి



మార్నింగ్ విజిట్‌లో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : అమృత్ ఒకటవ దశ కింద చేపట్టిన పైపులైన్‌లు, ఈఎల్‌ఎస్‌ఆర్ పనులను వెంటనే పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం పలు ప్రాంతాల్లో పైపులైన్లు, ఈఎల్‌ఎస్‌ఆర్ పనులను ఆయన పరిశీలించారు. రిమ్స్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న పైపులైన్ పరిశీలించి, పనులు పూర్తయిన వెంటనే బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. సంజన్న సర్కిల్ వద్ద పైపులైన్‌కు ఇంటర్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. ప్రకాష్‌నగర్ ఎస్సీ హాస్టల్ వద్దనున్న ఈఎల్‌ఎస్‌ఆర్ ట్యాంకు నుంచి డిస్ట్రిబ్యూషన్ నెట్ వర్క్ పరిశీలించి, ఇంటర్ కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. ఓంశాంతి నగర్ వద్దనున్న కాలువను పరిశీలించి తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్కావెంజర్స్ కాలనీ వాటర్ ట్యాంకు నుంచి ఔట్ లెట్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. పాత కడప ఈఎల్‌ఎస్‌ఆర్‌కు ఇంటర్ కనెక్షన్ ఇచ్చి, ఔట్‌లెట్ నుంచి ప్రతి ఇంటికీ వాటర్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

భావకవితా విహారి దేవులపల్లి



మాట్లాడుతున్న ఆటా భారతదేశ సమన్వయకర్త సూర్యచంద్రారెడ్డి

కడప కల్చరల్ : దేవులపల్లి కృష్ణశాస్త్రి భావకవితా విహారి అని అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) భారతదేశ సమన్వయకర్త జి. సూర్యచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కడప లోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రంలో దేవులపల్లి జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తెలుగులో భావకవిత్వం అనగానే కృష్ణశాస్త్రి గుర్తుకువస్తారన్నారు. బీఎస్ రెడ్డి నిర్మించిన మల్లీశ్వరి సినిమాకు మాటలు, పాటలు రాసి కృష్ణశాస్త్రి సినీ రంగప్రవేశం చేసి 70కిపైగా సినిమాలు, 160కిపైగా పాటలు రాశారని వివరించారు. సభాధ్యక్షులు, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, విశిష్ట అతిథి వైవీయూ పాలకమండలి సభ్యుడు డా.మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కృష్ణశాస్త్రి రచించిన సినీగీతాలు, వాటి నేపథ్యం, సాధించిన ప్రాచుర్యం గురించి వివరించారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి, డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, ఆచార్యులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 7, 8 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బుధవారం వీసీ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పోస్టర్లను ఆవిష్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిర భవితకు దోహదపడే నూతన, సంప్రదాయేతర ఇంధనాల ఉపయోగాలపై జాతీయ సదస్సును నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, సదస్సు సంచాలకులు ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్, సహ సంచాలకులు ఆచార్య ఎం.వి. శంకర్, సహ ఆచార్యులు డా. టి. చంద్రశేఖర్, డా. రాఘవేందర్, డా. సుబ్రమణ్యంశర్మ పాల్గొన్నారు.

■ యోగివేమన విశ్వవిద్యాలయం పరిపాలన విభాగంలోని డెవలప్‌మెంట్ సెక్షన్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్కాలర్ల ఫెలోషిప్‌ల ఫైళ్లను పరిశీలించారు. ఫైళ్ల నిర్వహణ ఖచ్చితంగా ఉండాలని సూచించారు. ఇటీవల ఉద్యోగులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ సిబ్బందికి ఏమేరకు ఉపయోగపడుతుందో ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



వాసుదేవపురంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఉద్యాన అధికారులు, సర్పంచ్

కాశినాయన : రైతులకు ఆయిల్‌పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి, సువేన్‌ఆగ్రో కంపెనీ జనరల్ మేనేజర్ కొండారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వాసుదేవపురం గ్రామానికి చెందిన జీ.దొరబాబు పొలంలో ఆయిల్‌ఫామ్ మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా 5 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. కాశినాయన, బి.మఠం, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల మండలాల్లో 200 హెకార్టలో ఉద్యాన పంటగా ఆయిల పామ్ పంటను సాగు చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. మొక్కలు నాటిన 4 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వరకు నిరంతర ఆదాయాన్ని ఈ పంట అందిస్తుందన్నారు. పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందించడంతో పాటు పంట దిగుబడి వచ్చిన తర్వాత దళారీల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కంపెనీ వారి నుండి నేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎంఐఓ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికగా 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఉపయోగపడుతోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాషా అన్నారు. మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా 23వ డివిజన్‌లోని నాగరాజుపేటలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, ఆయన్ను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలు సమావేశాలు నిర్మించుకోవడానికి కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరగా, స్థలం చూపిస్తే కట్టిస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. బి. లక్ష్మీదేవి అనే మహిళ తనకు ఇంటి స్థలం, ఇంటిని నిర్మించుకోవడానికి నగదు, వైఎస్సార్ ఆసరా, విద్యాదీవెన, వైఎస్సార్ పింఛన్ కానుక, వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా రూ.11.36 లక్షల లబ్ధి కలిగిందని ఆనందం వ్యక్తం చేసింది. షేక్ రహమతున్నీసా బేగం అనే మహిళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమకు వివిధ పథకాల ద్వారా రూ.10.16 లక్షల వరకూ మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి చేకూరలేదని, జగనన్నకు తామంతా తోడుగా ఉంటామని తెలిపారు. అంతకుముందు 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, పార్టీ నాయకులు బంగారు నాగయ్య, తోటక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, షఫీ, మియ్యా, మధు, లక్ష్మినారాయణ, మహిళా నేతలు పత్తిరాజేశ్వరి, టీపీ వెంకటసుబ్బమ్మ, నారాయణమ్మ, సుశీలమ్మ, తులశమ్మ పాల్గొన్నారు.

కరువు మండలాలు ప్రకటించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో కరువు మండలాలు ప్రకటించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 36 మండలాలలో ఖరీఫ్ సీజన్ ముగిసేనాటికి తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కరువు మండలాలను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య జిల్లా నాయకులు రంగారెడ్డి, చిన్న సిద్దయ్య, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : నగరంలోని నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బుధవారం డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో యువత అభివృద్ధి చెందాలంటే అందరికీ వారి శక్తి సామర్థ్యాలకు తగిన ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు. కానీ మోడీ ప్రభుత్వం ఇందులో ఘోరంగా వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు జగదీష్, నిరుద్యోగ (జెఏసీ) రాష్ట్ర కన్వీనర్ షేక్.సిద్ధికి, డీవైఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

చాపాడు : అయ్యవారిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్న కె.సుజిని రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గుర్రప్ప తెలిపారు. గత నెల 28న కడప స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన అండర్–17 హాకీ ఎంపిక పోటీలలో పాల్గొన్న కె.సుజిని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 3 నుంచి 5 వరకూ అనకాపల్లిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో సుజిని పాల్గొననుంది.

నేడు మహబూబ్ సుబహాని ఉరుసు



పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబే సుబహాని దర్గా

కమలాపురం : పట్టణంలోని పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబె సుబహాని, ఖుత్బే రబ్బాని, అబ్దుల్‌ఖాదర్ జిలాని, దస్తగిర్‌స్వామి వారి ఉరుసు మహోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహిస్తున్నట్లు దస్తగిరిస్వామి దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ముహమ్మద్ ఫైజుల్ గఫ్ఫార్ షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండాను పట్టణంలోని పురవీధుల గుండా మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహిస్తామని, అనంతరం గంధం ఎక్కించి ప్రత్యేక ఫాతెహ నిర్వహిస్తామన్నారు. అన్నదానం నిర్వహిస్తామని, స్వామి వారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకుందాం



జేసీఎస్ కన్వీనర్‌లకు కిట్టును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా , జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

సిద్దవటం : చంద్రబాబునాయుడు గతంలో 600 హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ఒక్కటీ అమలు చేయలేదని.. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ హామీలు గుప్పిస్తున్నారని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి విమర్శించారు. అవన్నీ బాబు నాటకాలని మండిపడ్డారు. 'అపుబాబు నీ నాటకం జగనే మా నమ్మకం' అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్‌ఆర్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు వారు సూచించారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ కళ్యాణ మండపంలో బుధవారం సాయంత్రం 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలు చెప్పిన విషయాలను గుర్తించుకొని ముఖ్యమంత్రి అయిన తరువాత వాటిని అమలు చేశారన్నారు. రాజంపేట నియోజక వర్గంలో అమ్మ ఒడికింద 35,659 మంది తల్లులకు రూ. 141 కోట్లు, వైఎస్‌ఆర్ చేయూత ద్వారా 1536 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రూ.73 కోట్లు, వైఎస్సార్ పెన్షన్ ద్వారా 44,950 మంది లబ్ధిదారులకు రూ. 414 కోట్లు, వైఎస్‌ఆర్ ఆసరా ద్వారా 38,446 మందికి రూ.108 కోట్లు, వైఎస్‌ఆర్ రైతు భరోసా ద్వారా 33004 మందికి రూ. 160 కోట్లు ఇలా పథకాలు అందజేశారన్నారు. ఇంత మంచి పాలన ఇస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తప్పకుండా మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఆయన అన్నారు. పేదల ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారన్నారు. నాడు–నేడు కింద పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. అనంతరం జగనే ఎందుకు కావాలంటే సంబంధించిన కరపత్రాల బ్యాగును వారు మండల జేసీఎస్ కన్వీనర్‌లకు అందజేశారు. జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, రైతు విభాగం మండల కన్వీనర్ పల్లిసుబ్బరామిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీన ర్ రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దీపం లక్ష్మిదేవి, మాజీ చైర్మన్‌లు జవహర్ బాష, సంజీవరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్‌నూర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు అమ్మాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఈదురుబాషా



హాజరైన డీలర్లు, వ్యవసాయ అధికారులు, రైతులు

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్స్ డీలర్లు రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అమ్మాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఈదురుబాష అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా బుధవారం కడప కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ సమావేశ మందిరంలో అగ్రికల్చర్ అధికారులు, ఫర్టిలైజర్స్ డీలర్లకు, రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే రాజు అని వారు బాగుంటే మనతోపాటు దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అలాంటి రైతులకు ప్రతి ఫర్టిలైజర్ డీలర్లు నాణ్యమైన ఎరువులతోపాటు పురుగుమందులు అమ్మాలన్నారు. నకిలీవి అమ్మితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎక్కడైనా ఎవరైనా కల్తీ ఎరువులుగానీ, నకిలీ పురుగు మందులుగానీ అమ్ముతున్నట్లు మీ దృష్టికి వస్తే తక్షణం మాదృష్టికి తేవాలన్నారు. ఈ విషయంలో ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు మాధవి, సుబ్బారావు, నరసింహారెడ్డి, నాగరాజు, విజిలెన్స్ అగ్రికల్చర్ ఆఫీసర్ బాలగంగాధర్ రెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశు విజ్ఞాన బడిని సద్వినియోగం చేసుకోండి



వైద్య సేవలను అందిస్తున్న మాలకొండయ్య

రామాపురం : పశు విజ్ఞాన బడిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ (ఏహెచ్) మాలకొండయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కల్పనాయిని చెరువు గ్రామంలోని మూగిరెడ్డిగారిపల్లెలో పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో మాట్లాడుతూ పశువులు పట్ల జాగ్రత్తలు , మెలుకువలను రైతు సోదరులకు తెలియజేశారు. ప్రస్తుతం పశు సంవర్ధకశాఖలో అమలులో ఉన్నటువంటి నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ గురించి వివరించారు. రైతు భరోసా కేంద్రంలో పశువైద్య సహాయకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని, పశువులకు తప్పకుండా డివార్మింగ్ మందులను తాగించాలన్నారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో 34 ఆవులు, 12 ఏనుములు, 240 గొర్రెలు, మేకలకు వైద్యం అందించారు. పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు తప్పకుండా పశువైద్యుల సూచనలు , సలహాలు పాటించాలన్నారు. అనంతరం కల్పనాయినిచెరువు రైతు భరోసా కేంద్రాన్ని, గువ్వలచెరువు పశువైద్యశాలను వారు పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో పశువైద్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, పశు సంవర్ధక శాఖ సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.